

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

19

**ఆ రోజు బన్ని,** ఆ పాప తల్లిదండ్రులు రాజేష్‌ని చూడటానికి వచ్చారు.

"ఎలా వున్నావబ్బాయ్?" అడిగింది బన్ని తల్లి రాజేష్ నుదుటిమీద చెయ్యివేసి.

"కులాసాగా వున్నాను" చెప్పాడు.

"ఒరేయ్ రాజేష్ ఇవన్నీ నీవు తినడానికేరా?" అడిగింది టేబుల్ మీద వున్న ఏపిల్స్‌ని, కమలాఫలాలని, ద్రాక్షపళ్ళని చూసి.

"అవును" చెప్పాడు.

"ఈ క్రీమ్ బిస్కట్స్ కూడా?"

"అవును. నువ్వూ తిను. కాసిని తీసుకో" చెప్పాడు.

"ఎంచక్కా నాకూ జ్వరం వస్తే బావుండునురా" చెప్పింది నీరజ కోసిచ్చిన ఏపిల్ ముక్కలని తింటూ.

బన్ని నెత్తిమీద ఓ మొట్టికాయ వేసి అరిచింది బన్ని తల్లి.

"ఏమిటా మాటలు?"

"మరి నాకెప్పుడైనా నువ్వుకాని, నాన్నకాని ఇవన్నీ కొనిచ్చారా?"

వాళ్ళు వెళ్ళిపోయాక చెప్పాడు రాజేష్.

"పాపం బన్నీకి ఇవన్నీ ఎప్పుడూ కొనివ్వరట."

రాత్రి నీరజ ఎక్కువసేపు మేలుకుని ఉదయం నిద్రపోతుంది. ఉదయం దశరథరామయ్య, రాజేష్ కలిసి కాలం వెళ్ళబుచ్చాల్సొస్తుంది.

గత వారంనించి రాజేష్ ఆ మంచంమీంచి కదలలేదు. మానసికంగా రాజేష్‌కి తనని బంధించిన ఫీలింగ్, రోజుకి పది పదిహేనుసార్లయినా `ఇంటికి పోదాం - ఇక్కడొద్దు, ఇంటికి పోదాం` అని మారాం చేస్తుంటాడు.

`ఈ ఒక్కరోజే రేపు వెళదాం` అని సముదాయిస్తుంటాడు దశరథరామయ్య.

మర్నాడు "సామాను సర్దు. వెళదామన్నావుగా" అంటాడు రాజేష్.

"ఇవాళకాదు రేపన్నాగా" చెప్తాడు దశరథరామయ్య.

"ఎన్నిసార్లు రేపు, రేపు, రేపు? ఏ రేపో చెప్పు ముందర. ఇక్కడయినా పడుకోవటమే, ఇంట్లో అయినా పడుకోవటమేగా. ఇంట్లోనే పడుకుంటాను."

"రేపు."

"అదిగో మళ్ళీ రేపు ఇక్కడ నాకేం బాగోలేదు."

డాక్టర్ శశిభూషణ్‌తో అయిదో రోజునించి చెపుతున్నాడు రాజేష్.

"అంకుల్ మమ్మల్ని ఇంటికి పంపించేయండి. మేం వెళ్ళిపోతాం."

"ఈ ట్యూబ్ తీసేశాక వెళుదువుగాని" జవాబు చెప్పాడాయన.

"తీసేయండి అయితే."

"తీస్తాను, టైమొచ్చినప్పుడు తీస్తాను."

"ఎప్పుడు వస్తుంది?"

"ఎందుకు యంగ్ మేన్ అంత తొందరపడతావు?"

"మీరిక్కడ రోజూ ఇంజక్షన్స్ యిచ్చి, బ్లడ్ ఎక్కించి నన్ను చంపుతున్నారు" కోపంగా చెప్పాడు రాజేష్.

నవ్వేసాడాయన.

"మిమ్మల్ని ఇలా మంచంమీద కదలకుండా పడుకోబెట్టి ఇంజక్షన్స్ పొడుస్తే మీకే తెలుస్తుంది బాధ."

"తప్పు. డాక్టర్‌తో అలా మాట్లాడొచ్చా?" చెప్పింది నీరజ.

"ఐ హేట్ దిస్ అంకుల్."

"ష్!"

"ష్ లేదు, ఆష్ లేదు అంతే"

"అవును అంతే" శశిభూషన్ ఇంజక్షన్ యిచ్చి నవ్వుతూ వెళ్ళాడు.

అయిదో రోజు చూసింది నీరజ రాజేష్ వీపుమీద వున్న బెడ్ సోర్స్‌ని. కదలకుండా పడుకోవడంవల్ల వీపుమీద అక్కడక్కడ చర్మం లేచిపోయి బెడ్ సోర్స్ వచ్చాయి. డాక్టర్‌కి చూపించింది వాటిని.

"అలా పడుకోనివ్వకండి. రోజుకి రెండు మూడు గంటలయినా కూర్చోపెడుతుండండి."

సిస్టర్ తగిన సూచనలిచ్చి వెళ్ళటం వల్ల, ఆమె మంచానికున్న హెడ్ రెస్ట్‌ని ఎత్తి కొక్కెం తగిలించింది. పడుకునే వున్నా వీపుమీద ఆనుకుని కూర్చున్నట్లుగా పడుకున్నాడు రాజేష్.

ఏడో రోజునించి రాజేష్ పళ్ళరసాలు, మంచినీళ్ళు, హార్లిక్స్ మొదలయినవి తీసుకోవడం తగ్గించేశాడు. మందులవల్ల, నీరసంవల్ల ఏం తాగాలన్నా హితవు పోయింది.

నీరజ బ్రతిమాలి, కోప్పడి బలవంతంగా తాగిస్తే కొంచెం తీసుకుని వదిలేస్తాడు. ఇంకా బలవంతం చేస్తే కక్కుకునేవాడు. డాక్టర్ ద్రవపదార్థం బాగా తాగించాలని, యూరిన్ అవుట్ పుట్ ఎక్కువగా వుండాలని మరీ మరీ చెప్పేవాడు వచ్చినప్పుడల్లా.

రాజేష్‌కి ఎనిమిదో రోజు జ్వరం వచ్చింది. డాక్టర్ టెంపరేచర్‌ని చార్టులో చూసి చెప్పాడు.

"యూరిన్ ఇన్‌ఫెక్షన్ అవడం వల్ల వచ్చింది జ్వరం. ఈ మందులు వాడండి" కొత్త మందులు రాసిచ్చాడు.

జ్వరం నూట నాలుగుకి ఒక్క పాయింట్ కూడా తగ్గలేదు ఆ రోజంతా. అంత నీరసంలోనూ ఉత్సాహంగా కబుర్లు చెప్పే రాజేష్ కన్ను తెరవలేదు. సిస్టర్ ఇచ్చిన ఐస్‌బాక్స్‌ని రాజేష్ తలమీద వుంచి అద్దసాగారు కాసేపు నీరజ, కాసేపు దశరథరామయ్య. మళ్ళీ రకరకాలుగా కలవరించసాగాడు రాజేష్.

భయంవేసి డ్యూటీ డాక్టర్‌కి చెప్పింది నీరజ. ఆయన వచ్చి చూసి "ఏంకాదు తగ్గిపోతుంది" అని చెప్పినా నీరజకి ధైర్యం రాలేదు.

శశిభూషన్ ఇంటికి ఫోన్ చేసింది. ఆయన ఇంటికి రాలేదింకా. ఇంట్లో వాళ్ళతో చెప్పింది వస్తే రాజేష్ సంగతి చెప్పమని.

ఐస్ బేగ్ అప్లయ్ చేసినా జ్వరం నూటనాలుగుకి ఒక్క డిగ్రీ కూడా తగ్గలేదు చీకటిపడినా.

నీరజ, దశరథరామయ్యలలో భయం అధికం అయింది. ఆరారగ రాజేష్ చేత గ్లూకోచ్ నీళ్ళు బలవంతంగా తాగించేశారు. ఆ రోజు యూరిన్ అవుట్ పుట్ రోజూకన్నా సగానికి పైగా తగ్గిపోయింది.దశరథరామయ్య కోడలికి ధైర్యం చెప్పసాగాడు. ఆయనకీ ఆదుర్దాగా వున్నా. ఇద్దరూ సాంబశివరావు కోసం ఎదురుచూడసాగారు.

20

ఆ రోజు సాంబశివరావు మనసేం బాగోలేదు. అందుకు కారణం అతనికి ఆఫీసు ఎడ్రస్‌కి వచ్చిన ఉత్తరం. అది విజయవాడ నించి వచ్చింది. జయంతి రాసింది.

తను కులాసా అని, సాంబశివరావుకి వివాహం అయిన సంగతి తన స్నేహితురాలు చెప్పిందని, అతని భార్య నీరజని తను చూశానని, ఆమె అదృష్టవంతురాలయినా కాకపోయినా సాంబశివరావు ఖచ్చితంగా అదృష్టవంతుడని రాజేష్ ఎలా వున్నాడో అడిగానని చెప్పమని.

ఆ ఉత్తరం, ఆ చేతివ్రాత పాతజ్ఞాపకాలని అనవసరంగా గుర్తుచేయడంతో చాలాసేపు మౌనంగా వుండిపోయాడు.

పర్మిషన్ తీసుకుని గంటముందే బయటకి వచ్చేశాడు. ఏం చేయాలో తోచలేదు. హాస్పిటల్‌కి వెళ్ళాలనిపించలేదు. దగ్గరే వున్న ఓ సినిమా థియేటర్‌కి వెళ్ళి కూర్చున్నాడు. ఎంత బావున్నా ఆ సినిమాని సరిగ్గా చూడలేకపోయాడు.

లలితా నగర్‌లోని తన ఫ్రెండ్ పంచాక్షరరావు ఇంటికి వెళ్ళాడు. అతను భార్యతో కలసి బయటికి వెళ్ళాడు.

అసౌకర్యంగా వున్నప్పుడు, ఓ ఇల్లు బావుండనప్పుడు అది ఖాళీచేసి ఇంకో ఇంటికి మారినట్లే అనుకున్నాడు అప్పట్లో. అలా నమ్మే ఆమెకి దూరం అయ్యాడు. కాని ఎమోషనల్ ఎలిమెంట్ అంటూ ఒకటుంటుందని ఎన్నడూ అనుకోలేదు. ఎందుకిలా బాధ కలుగుతోంది తనకి?

స్కూటర్‌ని పార్క్‌చేసి ఓ అరమైలు నడిచాడు ఆలోచిస్తూ. తనవల్ల కలిగిన, కేవలం తనవల్లే కలిగిన గర్భాన్ని విచ్ఛిత్తి చేయించటంవల్లా ఈ బాధ? కాదు....

కానేకాదు.....

అలా జరగకుండా వుండివుంటే, తనకీ ఓ కుర్రాడుండేవాడన్న సంగతి రాజేష్‌ని చూశాకే స్ఫురించింది. ఆ లోటే తనని గిల్టీగా ఫీల్ అయ్యేలా చేస్తోంది.

సాంబశివరావు తన ఫీలింగ్స్‌ని అలా 'స్టార్ట్ అవుట్' చేసుకున్నాక మనసు కొద్దిగా తేలికపడ్డట్లనిపించింది. అప్పట్లో తన ఆలోచన సబబేగా అనుకున్నాడు.

మళ్ళీ స్కూటర్ దగ్గరకి వెళ్ళి స్టార్ట్ చేసి సరాసరి హాస్పిటల్‌కి వెళ్ళాడు.

"ఏమండీ రాజేష్‌కి నూట అయిదు. ఒళ్ళు కాలిపోతోంది" చెప్పింది నీరజ ఆదుర్దాగా.

సాంబశివరావు రాజేష్ వంటిమీద చేయి వేసి చెప్పాడు.

"నేను డాక్టర్ ఇంటికి వెళ్ళి ఆయన్ని తీసుకువస్తాను."

గబగబా బయటికి నడిచాడు.

"ఈ ఉత్తరం పోస్టు చేయండి" అందించింది నీరజ. ఎడ్రస్ కూడా చూడకుండా దాన్ని అన్యమనస్కంగా జేబులో వేసుకున్నాడు.

ఆ ఉత్తరం వాళ్ళందరి జీవితాల్లో గొప్ప మార్పుని తేబోతోందన్న సంగతి వాళ్ళెవరికీ తెలియదు. అది రాజేష్ ఓ వారపత్రికకి రాసిన ఉత్తరం.

మర్నాడు ఉదయానికి రాజేష్ జ్వరం రెండు డిగ్రీలు తగ్గి నూటమూడుకి వచ్చింది. పచ్చిమంచినీళ్ళు కూడా తాగలేదు ఆ రోజంతా.

సాయంత్రం రౌండ్స్‌కి వచ్చిన డ్యూటీ డాక్టర్‌కి ఆ సంగతి తెలిసి ఆశ్చర్యపోయాడు.

"బాగా దాహం వేస్తుండాలే? ఎందుకని తాగలేదు?"

"దాహం లేదంటున్నాడు. మీరే అడిగి చూడండి" చెప్పాడు దశరథరామయ్య.

డాక్టర్ అందర్నీ బయటకు పంపించి, ఇంజక్షన్ ఇచ్చి అడిగాడు.

"నిజంగా దాహం లేదా?"

"ఊహూ"

"అయితే నాలుగు రకాల ఇంజక్షన్స్ యిస్తాను. అప్పటికీ దాహం వేయకపోతే ఇంకో నాలుగు రకాల ఇంజక్షన్స్ యిస్తాను. సరేనా?"

సిరంజిలోకి మందు ఎక్కిస్తున్నట్లుగా నటించాడు.

"వద్దు. ఓ అరగ్లాసు తాగుతాను" చెప్పాడు రాజేష్.

"ఎందుకు తాగడంలేదు?" బుజ్జగింపుగా అడిగింది సిస్టర్.

ముందర తటపటాయించినా చెప్పాడు రాజేష్.

"మంచినీళ్ళు తాగితే యూరిన్ బేగ్ నిండుతుంది. మాటిమాటికీ అది తాతయ్యో, పిన్నో ఖాళీ చేయాలిగా వాళ్ళకి అసహ్యంగా వుండదూ? ఏదయినా తిన్నా అంతే, నేను లేచి టాయ్‌లెట్‌కి వెళ్ళలేనుగా, బెడ్ పేన్ పెట్టి దాన్ని బాత్ రూంలోకి తీసుకెళ్ళి కడిగి..." మొహాన్ని అసహ్యంగా పెట్టిచెపుతున్నాడు రాజేష్.

"...వాళ్ళచేత అలా చేయించడం నా కసహ్యం."

"చూడు బాబూ నువ్విలా అనుకుంటే ఇక ఎప్పటికీ మంచం మీంచి కదలలేవు. వాళ్ళు నీ యూరిన్ బేగ్, బెడ్ పేన్ తీసి శుభ్రం చేస్తూనే వుండాలి. అలా జరగకూడదంటే సరిగ్గా తిని, కడుపునిండా మంచినీళ్ళు త్రాగుతూండాలి. లేకపోతే నీ ట్యూబ్ ఎప్పటికీ తియ్యరు."

"డాక్టర్ చెప్పింది నిజమే" చెప్పింది సిస్టర్.

"మా అమ్మ అయితే ఫర్వాలేదు. వాళ్ళచేత ఎలా ఈ పనులు చేయించడం? దాహం వేస్తున్నా శ్రీరామ శ్రీరామ శ్రీరామ అనుకుంటున్నాను" చెప్పాడు రాజేష్ నుదుటమీద పడ్డ జుట్టుని వెనక్కి తోసుకుని.

"నీ ఇష్టం. ఆలోచించుకో. త్వరగా హాస్పిటల్ నుంచి బయటకు వెళతావాలేదా? ఇలా పక్కమీదే వుండి వాళ్ళచేత ఆ పనులు చాలాకాలం చేయించుకుంటావా?"

డాక్టర్ దశరథరామయ్యకి చెప్పాడు రాజేష్ మనసులో సంగతి. "అంత సెన్సిటివ్ వాళ్ళతో యిబ్బంది. జాగ్రత్తగా చూసుకోండి" చెప్పాడు. నీరజ, దశరథరామయ్య రాజేష్‌తో చెప్పారు. ఆ పనులు చెయ్యడానికి తమకి ఎలాంటి అసహ్యం లేదని, త్వరగా నయమయితే ఇంటికి వెళ్ళాలని ఎదురుచూస్తున్నామని, వాళ్ళిద్దరూ దాదాపు అరగంటదాకా హితబోధ చేశారు.

"నీకోసం నేను యూనివర్శిటీకి కూడా వెళ్ళడంలేదు. నా చదువు పోతోంది" చెప్పింది నీరజ.

"సరే అయితే, మీ మాట వింటాను" చెప్పాడు రాజేష్.

ఆ రాత్రికి జ్వరం బాగా తగ్గిపోయింది. రాజేష్ లేచి తిరగొచ్చని చెప్పాడు, మర్నాడు ఉదయం రాజేష్‌ని పరీక్షించిన శశిభూషన్ "అయితే లేచి నడిచేటప్పుడు పొత్తి కడుపులోంచి ట్యూబ్ కనెక్ట్ చేయబడ్డ యూరిన్ బేగ్‌ని జాగ్రత్తగా చేత్తో పట్టుకోవాలి. లేకపోతే ట్యూబ్ కడుపులోంచి బయటకు వచ్చెయ్యొచ్చు. అది ప్రమాదం లేదా బేగ్ నుంచి ట్యూబ్ వుడిపోవచ్చు" హెచ్చరించాడు.

రాజేష్‌ని ఎనిమిదో రోజు ఉదయం మంచం మీంచి మొదటిసారిగా కిందకి దింపారు. యూరిన్ బేగ్‌ని దశరథరామయ్య పట్టుకుంటే కాళ్ళ మీద నిలబడలేక కుంటుతున్న రాజేష్‌ని నీరజ పట్టుకుంది. అయిదు నిముషాల్లో రాజేష్ ఎవ్వరూ పట్టుకోకుండా బేలన్స్‌డ్‌గా నడవగలిగాడు. నీరసంగా వుండటంతో అట్టే నడవలేని రాజేష్ బాల్కనీలో వున్న కుర్చీలో కూర్చోపెట్టారు. రాజేష్ బయట రోడ్డుమీద వెళ్ళే కార్లని, స్కూటర్లని విడివిడిగ లెక్కపెడుతూ గడిపాడు గంటన్నరదాకా తర్వాత మళ్ళీ మంచం మీద పడుకోబెట్టారు వాడిని.

"ఇంకో వారం రోజుల్లో ఈ ఖైదులోంచి బయటపడతాం" చెప్పాడు దశరథరామయ్య నీరజతో.

ఎనిమిది రోజులుగా ఆ హాస్పిటల్ గదిలో వుండి వుండి విసుగ్గా వుంది. మంచం మీదే వున్న రాజేష్ లేచి నడవగలగడం వాళ్ళకి ఎంతో రిలీఫ్‌గా వుంది.

మిగతా వారం రోజులూ, హాస్పిటల్ నుంచి బయటకి వెళ్ళేరోజు దగ్గరవుతోందనే సంతోషంతో త్వరగా గడిచాయి. నీరజ యిప్పుడు యూనివర్శిటీకి వెళ్తోంది. దశరథరామయ్య ఒక్కడే ఉదయం రాజేష్ గదిలో వుంటున్నాడు రాత్రిళ్ళు ముగ్గురూ వంతుల ప్రకారం రాజేష్ ప్రక్కన మేలుకుని కూర్చుంటున్నారు.

ఉదయం పేపరు చదివాక రాజేష్ చందమామ, కామిక్స్, వారపత్రికలు చదువుతుంటాడు. పన్నెండున్నరకి భోజనం అయ్యాక ఓ గంటసేపు పడుకుంటాడు. మూడు, మూడున్నర నుంచి యిద్దరికీ విసుగు మొదలవుతుంది. నీరజ, సాంబశివరావు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తుంటారు. ఆ సమయంలో ఏదో ఒకటి ఆడుతుంటారు.

ఓ రోజు 'డిప్ ఇన్ కప్' ఆట ఆడారు. ఆరడుగుల దూరంలో ఓ ఖాళీ కప్పు వుంచి, దాంట్లోంచి ఒకరి తర్వాత మరొకరు చెరో రంగు బటన్స్ గురి చూసి విసరగలగడం ఎవరివి ఎక్కువ పడితే వారు గెలిచినట్లు. రోజులు గడిచేకొద్దీ కప్పుల సంఖ్య బటన్స్ రంగుల సంఖ్య ఎక్కువ చేసి ఫలానా రంగు బటన్ ఫలానా కప్పులోనే పడాలి అని ఆటని అభివృద్ధి చేశాడు.

లేదా యిద్దరూ తాము రెండు వస్తువులుగా భావించి మాట్లాడుకోసాగారు ఆ సంభాషణ తమాషాగా వుంటుంది.

రాజేష్ వేరుశెనగగా భావించి చెప్తాడు.

"నేనెందుకు పుట్టానా అనిపిస్తుంది ఏ క్షణంలో ఏమౌతుందో తెలీకుండా వుంది. గానుగ వాళ్ళు తీసుకెళ్ళి నన్ను

గానుగలో పిప్పి పిప్పి చేసి నూనె తీస్తారు పిప్పిని పశువులకి వేస్తారు. నూనెని కాగే పెనంలో వేసి వంట చేస్తారు. లేదా తలకి రాసుకుంటారు.''

''నా పని అలాగే వుందే వేరు శనగపప్పు. కండెనించి నన్ను వేరు చేస్తారు. దాన్ని ఎండబెట్టి ఉప్పు, కారం, నూనె కలిపి వేడి వేడి పెనం మీద వేస్తారు. వెంటనే నేను టప్ టప్ మని పేలి పాప్‌కార్న్‌గా మారతాను. స్టయిలుగా నన్ను పాలిథిన్ కవర్లలో బంధిస్తారు. ఇక ఎదురు చూడాలి. ఏ క్షణంలో నా పని ఆఖరవుతుందా అని. ఎవరో కుర్రాడు నేను కావాలని పేచీపెడితే పెద్దవాళ్ళు కొనిస్తారు. నన్ను సగం క్రింద పారపోసి సగం మీద పోసుకుంటూ తింటాడు. సినిమా అయ్యాక కిందపడ్డ నన్ను అందరూ తొక్కుకుంటూ వెళతారు.''

''ఇంతేనా? నన్ను వేడి నూనెలో వేయించి ఉప్పూ, కారం, పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయలూ కలుపుకుని తినేస్తారు. లేదా నూనె లేకుండా వేడి పెనం మీద వేయించి స్కూలుకెళ్ళే పిల్లల జేబుల్లో నింపుతారు. వాళ్ళు పరుగెత్తుతూ వుంటే సగం రోడ్డునిండా నేనే. నా మీద ఎన్ని బస్సులు, ఎన్ని కార్లు వెళతాయో చెప్పలేను. ఇంకా నన్ను బెల్లం పాకంలో వేసి, ఆరబెట్టి ఉండలు ఉండలుగా చేసి సీసాల్లో నింపి అమ్ముతారు.''

''అదీ బాధే ఒక్కోసారి నన్ను కండెనుంచి విడదీయకుండా నిప్పులమీద కాల్చి కొరికి తింటారు లేదా ఉప్పునీళ్ళలో వుడకబెట్టి తింటారు.''

''టెరిబుల్ మన జీవితాలు టెరిబుల్. మనం పుట్టినప్పటినుంచి ఇద్దరికీ కష్టాలే.''

మనసారా పగలబడి నవ్వుకుంటారు ఆ వింత సంభాషణకి.

సాయంత్రం నీరజ సాంబశివరావులు రాగానే అది మళ్ళీ వినిపిస్తారు.

లేదా స్కూటర్, కారులాగా మాట్లాడుకుంటారు.

''కొత్తగా కొన్నప్పుడు నాకు నిమ్మకాయలతో దిష్టితీసి, కొబ్బరికాయ కొట్టి పూజ చేస్తారు. గుడికి కూడా తీసుకెళతారు. క్రమంగా పాతబడే కొద్దీ నేనంటే నిర్లక్ష్యం ఏర్పడుతుంది. నన్నెప్పుడు అమ్మేసి యింకోటి కొత్తది తెచ్చుకుందామా అని తహ తహలాడుతుంటారు'' కారు పాత్రని పోషించే దశరథరామయ్య చెప్పాడు.

''ఈ మనుషులంతా ఇంతే. నా మీద ఇద్దరు ఎక్కుతారు. మనుషులు అడ్డం వస్తే నా ముక్కుపీకి నేను బాధగా అరిచేలా చేస్తారు. నాకు దహం అయినప్పుడల్లా కావాల్సినంత పెట్రోల్ పోస్తుంటారు. లేకపోతే చస్తే నడవను. తర్వాత నా దాహం తీరుస్తాడులే పోనీలే పాపం అనుకున్నామా ఇక అంతే సంగతులు. ఈ మనుషులంతా దుర్మార్గులు. వాళ్ళు చస్తే అప్పు తీర్చరు. నేను రోడ్డుమీద వుంటానా ఎదురింటి పిల్లవాడు వచ్చి నా మీదకి ఎక్కి తొక్కి నా హేండిల్ బార్‌ని అటూ, ఇటూ తిప్పి నోటితో 'పిప్ పిప్' అని చప్పుడు చేస్తూ నేను పరిగెడుతున్నట్లుగా భావిస్తాడు. అప్పుడు మాత్రం నాకు భలే తమాషాగా వుంటుందిలే''

ఒకసారి పక్కలు మార్చడానికి వచ్చిన నర్సులు కూడా ఆ సంభాషణని నవ్వుతూ వింటూంటారు. తరువాత అది వినడానికే వచ్చేవారు. హాస్పిటల్‌లో వున్న పదిరోజులూ సాంబశివరావు, నీరజల మధ్య ఎలాంటి పొరపచ్చాలు రాలేదు. అందరి మనసు రాజేష్ ఆరోగ్యం కుదుట పడాలనే విషయం మీద వుండడం చేత ఇతర విషయాలేం ఆలోచించలేదు.

డాక్టర్ శశిభూషణ్ పదహారో రోజు ఉదయం యూరిన్ బేగ్‌ని తీసేశాడు. ట్యూబ్ శరీరం నించి తీయకుండా వుంచేసి దానికి బిరడాని పెట్టి చెప్పాడు.

''బాత్ రూంకి వెళ్ళి యూరిన్ మామూలుగా నార్మల్‌గా పోసుకోమనండి. మొదటి రెండురోజులు కొద్దిగా మంటగా

వుంటుంది, ఆ ద్వారం ఇంతకాలం వుపయోగించకపోవడం వల్ల. తర్వాత నొప్పివుండదు. ఇంకో మూడురోజులుంటే ఈ ట్యూబు కూడా తీసేస్తాను.''

రాజేష్ పొత్తికడుపు మీద పడ్డ ఇరవైమూడు కుట్లు క్రమంగా చర్మలో కలిసిపోతున్నాయి. ఇప్పుడు బేండేజ్ పరిణామం తగ్గింది. ఇదివరకటిలా పెద్దదిగా లేదు.

మొదటి రెండురోజులూ రాజేష్ మళ్ళీ ద్రవ పదార్థాలుతీసుకోవడం తగ్గించేశాడు. నెంబర్ వన్ పోసుకునేటప్పుడు మంట పుట్టటంతో పెద్దవాళ్ళే బలవంతం చేసి తాగించసాగారు.

డాక్టర్ శశిభూషణ్ పంతొమ్మిదోరోజు మళ్ళీ రాజేష్‌ని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్ళి జనరల్ ఎనెస్తీషియా ఇచ్చి డైలోషన్ చేసి చూసి అంతా క్రమంగానే వుందని చెప్పాడు ఆఖరి ట్యూబుకూడా తీసేశాడు.

ట్యూబ్ వున్నచోట గాయం మానడానికి కొంతకాలం పడుతుందని, అప్పటిదాకా రెండు రోజులకోసారి వచ్చి కట్టు మార్పించుకోవాలని, లేకపోతే మళ్ళీ యూరిన్ ఇన్‌ఫెక్షన్ వల్ల జ్వరం రావచ్చని చెప్పాడు. పంతొమ్మిదోరోజు రాత్రి సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్‌లోని రూం నెంబరు పన్నెండు ఖాళీచేసి అంతా లలితానగర్‌లోని తమ ఇంటికి చేరుకున్నారు. వెళ్ళబోయే ముందు రాజేష్ సిస్టర్స్‌కి, ఆయాలకి, డాక్టర్స్‌కి, స్వీపర్స్‌కి తను గీసిన రకరకాల బొమ్మలని బహుమతిగా ఇచ్చాడు. సాంబశివరావు స్వీట్ బాక్స్ కొనిచ్చాడు. రాజేష్ హాస్పిటల్ నుంచి వెళ్ళిపోతుంటే డాక్టర్స్, డ్యూటీ డాక్టర్స్, ఇతర పేషెంట్స్ చాలామంది కింద గేటుదాకా వచ్చి వీడ్కోలు చెప్పారు.

సాంబశివరావు, నీరజ, దశరథరామయ్య యింటికి వెళ్ళగానే ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యారు. ఏదో ఖైదులోంచి విడుదలయిన ఫీలింగ్ అందరికీ.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in